మన రాజధాని
రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
శుక్రవారం 17 ఏప్రిల్ 2026 పేజీలు : 4

# స్మార్ట్ బాపట్ల గా వినోద్ యాక్షన్ ప్లాన్

- పట్టణ రూపురేఖల్లో మార్పు కన్నామ్
- ఆధునిక నగరంగా రూపకల్పన
- పచ్చదనం పెంపుతో పట్టణ సౌందర్యం



బాపట్ల మున్సిపాలిటీని ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పట్టణంలో పర్యటించిన ఆయన, 50 రోజుల్లో అభివృద్ధి పనులకు వేగం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు.

బాపట్ల రక్షణ బ్యూరో



వివరాలు 2లో..

# టీ షాపులపై ఆకస్మిక తనిఖీలు

- నాణ్యత లేకపోతే ఉపేక్షించేది లేదు
- పరిశుభ్రత లేని షాపులకు నోటీసులు
- వినియోగదారుల ఆరోగ్యం పై ఆటలు ఆపాలి..

బాపట్ల పట్టణంలోని టీ షాపులపై ఆహార భద్రతాధికారి ప్రణీత్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నాణ్యతలేని పదార్థాల వినియోగం, పరిశుభ్రత లోపాలు గుర్తించి యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని పలు దుకాణాలకు జరిమానాలు విధించి హెచ్చరికలు జారీ చేశారు.

బాపట్ల రక్షణ న్యూస్



వివరాలు 2లో..

# సచివాలయం తనిఖీలో కలెక్టర్ ఆగ్రహం

- 5వ వార్డు సచివాలయంపై ఆకస్మిక తనిఖీ
- నిబంధనలకు విరుద్ధంగా వస్త్రధారణతో విధులకు హాజరు
- చర్యలకు ఆదేశాలు..



2లో.

పట్టణంలోని స్వర్ణ వార్డు యాదవకాలనీ 5వ వార్డు సచివా లయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి పరిస్థి తులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సచివాలయంలో మరుగుదొడ్లు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, గడు వు తీరిన అర్జీలు పెండింగ్‌లో ఉండడం, నిబంధనలకు విరు ద్ధంగా వస్త్రధారణతో డిజిటల్ అసిస్టెంట్ విధులకు హాజరు కావడంపై సిబ్బందిని కఠినంగా హెచ్చరించారు. కార్యాల యాన్ని సరిగా నిర్వహించలేకపోతే పట్టణాన్ని ఎలా పరిశుభ్రంగా ఉంచుతారని ప్రశ్నించారు.

బాపట్ల రక్షణ న్యూస్.....

# నీటి భద్రత మనదే





- నీటి భద్రతపై దృష్టి
- భూగర్భ జలాల పెంపు
- కరువు రహిత లక్ష్యం

జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యంగా జలధార--జలహారతి కార్యక్రమాన్ని సమన్వయంతో అమలు చేయాలని కలెక్టర్లు వినోద్ కుమార్, కృతిక శుక్లా పేర్కొన్నారు. నీటి వనరుల సమర్థ వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సు

వివరాలు 2లో..

ఉమ్మడి గుంటూరు రక్షణ న్యూస్

# బాలుడి కుటుంబానికి భరోసా

- ప్రభుత్వ సహాయంపై హామీ
- ఉద్యోగ అవకాశంపై భరోసా
- పార్టీ తరపున అండగా ఉంటాం



2లో.

స్కూల్ బస్సు ప్రమాదంలో మృతి చెందిన నాలుగేళ్ల బాలుడి కుటుంబానికి ప్రభుత్వం, పార్టీ తరపున అండగా ఉంటామని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక, ఉద్యోగ సహాయం కల్పిస్తామని తెలిపారు.

ప్రత్తిపాడు రక్షణ న్యూస్

17- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/17/2026 12:44 AM Page 2



# స్మార్ట్ బాపట్ల గా వినోద్ యాక్షన్ ప్లాన్

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ బ్యూరో**

బాపట్ల మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునిక నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి తెలిపారు. గురువారం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మున్సిపాలిటీ పరిధిలో పర్యటించి పలు అంశాలపై సమీక్ష నిర్వహిం చారు.పట్టణ అభివృద్ధికి ఏడాది ప్రణాళిక రూపొందించడంతో పాటు, తొలి 50 రోజుల్లో కీలక పనులను ప్రారంభించాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, మురుగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు.మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచడంతో పాటు ఆస్తి పన్నుల వసూళ్లను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపు, డివైడర్లలో మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను వేగవంతం చేయాలని చెప్పారు.

# బాలుడి కుటుంబానికి భరోసా

మొదటి పేజీ తరువాయి

**ప్రత్తిపాడు రక్షణ న్యూస్**

ప్రతిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు మండలం వరగాని గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పరామర్శించారు. బాలుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.బాధిత తల్లిదండ్రులను ఓదార్చిన ఆయన, కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. బాలుడి తండ్రి బీటెక్ చదివి పెయింట్ పని చేస్తుండటం బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబానికి ఉద్యోగ అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ, పార్టీ కార్యకర్త కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# నీటి భద్రత మనదే

మొదటి పేజీ తరువాయి

**ఉమ్మడి గుంటూరు రక్షణ న్యూస్**

జిల్లాలో జలధార--జలహారతి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి నీటి భద్రతను కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో సాగు, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.గ్రామస్థాయిలో జలధార గ్రామ సభలు నిర్వహించి చెరువులు, కుంటలు, కాలువలను శుద్ధి చేయాలని తెలిపారు. భూగర్భ జలాల పెంపునకు రీచార్జ్ పిట్లు ఏర్పాటు చేయాలని, వర్షపు నీటి నిల్వలు పెంచాలని ఆదేశించారు.ఇదే అంశంపై మరోవైపు కలెక్టర్ కృతిక శుక్లా కూడా టెలీకాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించి, నీటి వనరుల వినియోగంపై దృష్టి పెట్టాలని సూచించారు. సాగునీటి సంఘాల బాధ్యతను సమర్థంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కరువు రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఇద్దరు కలెక్టర్లు స్పష్టం చేశారు.

# సచివాలయం తనిఖీలో కలెక్టర్ ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్.....**

పట్టణంలోని యాదవకాలనీ 5వ వార్డు సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో మరుగుదొడ్లు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి సిబ్బందిని తీవ్రంగా మందలించారు. ప్రభుత్వ కార్యాలయాలను ఇలాగే నిర్వహిస్తారా అని ప్రశ్నిస్తూ బాధ్యతగా పని చేయాలని సూచించారు.డిజిటల్ అసిస్టెంట్ నైట్ ప్యాంట్‌తో విధులకు హాజరుకావడాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే అతనిని బయటకు పంపించి నిబంధనలకు విరుద్ధంగా వస్త్రధారణపై సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అలాగే గడువు తీరిన 11 అర్జీలు పెండింగ్‌లో ఉండడంపై కూడా అసహనం వ్యక్తం చేశారు."మీ ఇంటిని ఇలాగే ఉంచుకుంటారా? మీరు పనిచేసే సచివాలయాన్ని సరిగా నిర్వహించలేకపోతే పట్టణాన్ని ఎలా పరిశుభ్రంగా ఉంచుతారు?" అని సిబ్బందిని ప్రశ్నించారు. సచివాలయంలో హాజరు పట్టిక, ప్రభుత్వ సేవల దస్త్రాలను పరిశీలించి ప్రతిరోజు ఎంతమంది ప్రజలు వస్తున్నారు, ఎలాంటి సేవలు పొందుతున్నారు అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయని పేర్కొన్నారు.ఈ తనిఖీలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి అధికారిని విజయలక్ష్మి, మున్సిపల్ మేనేజర్ చంద్రమోహన్, ఇంజినీర్ ఎస్ఎస్ఆర్ కృష్ణారెడ్డి, ఆర్వో అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

# టీ షాపులపై ఆకస్మిక తనిఖీలు

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల పట్టణంలో ఆహార భద్రత ప్రమాణాల అమలుపై జిల్లా ఆహార భద్రతాధికారి ప్రణీత్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా టీ సెంటర్లపై దృష్టి సారించి, నాణ్యత, పరిశుభ్రత అంశాలను సమీక్షించారు.పలు దుకాణాల్లో నాణ్యతలేని టీ పొడి, మిల్క్ పౌడర్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అలాగే పాలు, తినుబండారాలను అస్వచ్ఛ పరిస్థితుల్లో నిల్వ ఉంచడంపై షాప్ యజమానులను తీవ్రంగా మందలించారు. పరిశుభ్రత లేకుండా ఆహార పదార్థాలు విక్రయించడం వినియోగదారుల ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించారు.నిబంధనలు పాటించని పలు టీ షాపులపై జరిమానాలు విధించి, వెంటనే ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉల్లంఘనలు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.పట్టణంలో ఆహార భద్రతను కట్టుదిట్టం చేయడమే లక్ష్యంగా తనిఖీలు కొనసాగిస్తామని, వ్యాపారులు నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. వినియోగదారులు కూడా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

# బానిసత్వానికి చెక్




**చెరుకుపల్లి రక్షణ న్యూస్**

వెట్టిచాకిరి నుంచి నలుగురు ఎస్టీ యానాది కుటుంబ సభ్యులను విముక్తి చేసినట్లు ఆర్డీవో గ్లోరియా తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చెరుకుపల్లి మండలం రాజోలు గ్రామానికి చెందిన వీరిని విడుదల చేసి పత్రాలు అందజేశారు.గత ఐదేళ్లుగా కర్లపాలెం మండలం దుండివారిపాలెంలో ఓ రైతు వద్ద కూలీ పనుల పేరుతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి రక్షించారు. వెట్టిచాకిరి నిర్మూలన చట్టం-1976 ప్రకారం ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు.బాధితులకు ప్రభుత్వ పథకాలు, పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఘటన వెలుగులోకి తీసుకువచ్చిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను అభినందించారు.

# ఆన్లైన్ గణన ప్రక్రియకు శ్రీకారం



**వినుకొండ రక్షణ న్యూస్**

జనాభా గణనలో భాగంగా డిజిటల్ స్వీయ గణన ప్రక్రియను ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు గురువారం ప్రారంభించారు. ఏప్రిల్ 16 నుంచి 30 వరకు ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు.ఆధార్ తదితర గుర్తింపు పత్రాలతో వెబ్ పోర్టల్‌లో లాగిన్ అయ్యి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా డేటా సేకరణ వేగవంతమవుతుందని తెలిపారు. ఖచ్చితమైన గణాంకాల ఆధారంగా భవిష్యత్తులో సంక్షేమ పథకాలను అర్హులకు అందించవచ్చన్నారు.వినుకొండ నియోజకవర్గ ప్రజలు స్వచ్ఛందంగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్, అధికారులు పాల్గొన్నారు.

# "ప్రజాసేవలో వెంకటరాజు ఆదర్శం"



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్లలో మంతెన వెంకటరాజు 58వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నిర్వహించిన స్మారక కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొని ఆయనకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు విన్నకోట సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంతెన వెంకటరాజు గారు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన అరుదైన నాయకుడని కొనియాడారు. రాజకీయాలను వ్యక్తిగత ప్రయో జనాలకు కాకుండా ప్రజల సంక్షేమానికి వేదికగా మలచి, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన మహనీ యుడని పేర్కొన్నారు. ఆయన చూపిన నిబద్ధత, నిజాయితీ, సేవాభా వం నేటి నాయకులకు ఆదర్శప్రాయమని తెలిపారు. ప్రాంత అభివృద్ధి కోసం వెంకటరాజు గారు చేసిన కృషి చిరస్మరణీయమని, ప్రజలతో సన్నిహితంగా మెలిగి వారి అవసరాలను అర్థం చేసుకుని సేవలందించిన తీరు ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. ఆయన స్మారకార్థం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని, యువత ఆయన జీవితం నుండి స్ఫూర్తి పొంది సమాజానికి సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అనంతపరమరాజు, తెలుగుదేశం పార్టీ నాయకుడు తాతా జయప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంట అంజిబాబు తదితర రాజకీయ నాయకులు, అభిమానులు పాల్గొని వెంకటరాజు గారికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమం భక్తి, గౌరవ భావాలతో సాగింది.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ముండ్లమూరు రక్షణ న్యూస్**

ముండ్లమూరు మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయ అధికారి తిరుమలరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రబీ 2025-26 పంట కాలంలో సాగు చేసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం ప్రారంభించినట్లు తెలిపారు. మండలంలో పసుపుగల్లు, ఉమామహేశ్వరపురం, బొప్పూడివారిపాలెం సొసైటీల ద్వారా రైతుల నుండి ధాన్యం సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా సొసైటీల పరిధిలో ఉన్న గ్రామాల రైతులు తమ ధాన్యాన్ని సంబంధిత కేంద్రాలలో అమ్ముకోవచ్చని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన BPT 5204, BPT 2270, NLR 33892, KNM 1638, MTU 1262, MTU 1224, MTU 1271 రకాల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వరి రైతులు పంట నమోదు చేసుకున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, అవసరమైన వివరాల కోసం రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సిబ్బంది, సొసైటీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# క్రీడోత్సవానికి ఎమ్మెల్యే కి ఆహ్వానం



**చిన్నగశీజాం రక్షణ న్యూస్**

చిన్నగంజాం మండలం కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని రామచంద్ర నగర్ గ్రామంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు గారిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. గ్రామస్తులు, నిర్వాహకులు కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలసి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. గ్రామంలో క్రీడలకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే పాల్గొనడం ద్వారా టోర్నమెంట్‌కు మరింత ఉత్సాహం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేస్తా





**ప్రత్తిపాడు రక్షణ న్యూస్**

ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన కోడూరి అఖిల్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించి ప్రోత్సహించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అఖిల్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేస్తానని తెలిపారు. నాయకత్వం మార్గదర్శకత్వంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అఖిల్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభినందనలు తెలిపారు.

## పోక్సో కేసులో యువకుడు అరెస్ట్



**దాచేపల్లి రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా దాచేపల్లి పట్టణంలో మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం దాచేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐ రాజేష్ వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, స్థానిక పెట్రోల్ బంకులో పనిచేస్తున్న దంపతులు తమ ఆరేళ్ల కుమార్తెను వెంట తీసుకురాగా, అదే బంకులో పనిచేస్తున్న బత్తుల కోటేశ్వరరావు (బాలరాజు) బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, జిల్లా ఎస్పీ, గురజాల డీఎస్పీ ఆదేశాల మేరకు విచారణ జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం నిందితుడిని గురజాల కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు.

## భూ రీసర్వేపై ప్రజల్లో చైతన్యం




**కర్లపాలెం రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో భూ రీసర్వే ఐదవ దశ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమాలను మండల తహసిల్దార్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో అవగాహన ర్యాలీతో పాటు గ్రామసభను కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ రీసర్వే ప్రక్రియ ఏప్రిల్ 15, 2026 నుంచి ప్రారంభమై పేరలి రెవెన్యూ పరిధిలోని అన్ని గ్రామాలు, పంచాయితీలను కవర్ చేయనుంది. పట్టా భూముల సరిహద్దులను ఖచ్చితంగా నిర్ధారించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీదేవి మాట్లాడుతూ, సర్వేకు ముందు నోటీసులు జారీ చేస్తామని, సర్వే సిబ్బంది వచ్చినప్పుడు రైతులు తమ భూముల వద్దకు హాజరై హద్దులను చూపించి సహకరించాలని కోరారు. గ్రామ ప్రజలు ర్యాలీ, గ్రామసభలకు హాజరై భూ రీసర్వేపై అవగాహన పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఎమర్జెన్సీ సేవలకు సిద్ధం



**కర్లపాలెం రక్షణ న్యూస్**

కర్లపాలెం మండలంలోని ప్రజలు అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఆయన కర్లపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యశాల పరిసరాలు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎండలు తీవ్రంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు మధ్యాహ్నానికి ముందే పనులను ముగించుకుని వడదెబ్బలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని యాజలి, పేరలి, చింతాయపాలెం, గణపవరం, పాత నందాయపాలెం గ్రామాల్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ, వైద్యశాల 24 గంటలు అందుబాటులో ఉంటుందని, పాముకాటు, విషప్రయోగం, గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదిస్తే తక్షణ వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సువర్ణకుమారి, పి హెచ్ ఎన్ ప్రభావతి, సూపర్వైజర్ ఇస్సాకు, రామోజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు భద్రత సూచనలు



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలో అగ్ని ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఏప్రిల్ 14 నుంచి 20 వరకు జరుగుతున్న ఈ కార్యక్రమాల్లో భాగంగా గురువారం బాపట్ల బస్ స్టేషన్, రైల్వే స్టేషన్, విజయకృష్ణ థియేటర్, వాణిజ్య సముదాయాలు, ప్రధాన కూడళ్లలో అగ్నిమాపక సిబ్బంది కరపత్రాలు, గోడపత్రికలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంట గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన సూచనలు ప్రజలకు వివరించారు. గృహిణులు ప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ జి. రామ సిద్ధార్థ సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, రైల్వే సిబ్బంది, ప్రజలు పాల్గొని అవగాహన కార్యక్రమానికి సహకరించారు.